## బ్రిటన్‌లో ఇంగ్లీషు అంతగా రాని తెలుగు ఆడపడుచుల అంతర్వేదన!

నిద్రనుంచి మెలుకువ వచ్చిన చిత్రకు ఒక్క క్షణం తనెక్కడున్నదీ అర్థం కాలేదు. గది అంతా మసక చీకటిగా వుంది. నిన్నటి ప్రయాణమంతా గుర్తొచ్చి అది కలా? నిజమా? అన్పించింది.

కాని తన శరీరానికి యెన్నడూ యెరగనంత మెత్తగా తగుల్తున్న బెడ్. కిటికీలకు వ్రేలాడుతున్న పూలపూల ఖరీదైన కర్టెన్స్. బాదామ్ షేప్‌లో వున్న పెద్ద అద్దంతో డ్రెస్సింగ్ టేబిల్. మూలగా రోజ్‌వుడ్ రౌండ్ టేబిల్‌పై రంగు రంగుల ప్లాస్టిక్ పువ్వులతో నిండిన క్రిస్టల్ గ్లాస్ ఫ్లవర్ వాజ్-ఇవన్నీ తన ప్రయాణం నిజమేనని చెప్తున్నాయి. "అయితే నేనిప్పుడు నిజంగానే ఇంగ్లండ్‌లో ఉన్నానన్నమాట" అనుకుంటూ బద్ధకంగా లేచి లైట్ వేసింది. జిగేలుమనే ఆ లైట్ వెల్తురుకు కళ్ళు మూసుకుపోయాయి.


టైమ్ చూస్తే పగలు నాలుగు గంటలు మాత్రమే అవుతోంది. ఈ చలికాలమంతా ఇలాగే చీకటి త్వరగా పడ్తుందని భర్త చెప్పిన మాటలు గుర్తొచ్చినయ్.

కిటికీ తెరలు కాస్త తొలగించి రోడ్డు మీదికి చూడసాగింది. పసుపు పచ్చని స్ట్రీట్ లైట్ల కాంతి వింతగా కన్పించింది.

రయ్యి రయ్యిన దూసుకుపోయే రకరకాల కార్లు "అసలు మనుషులకంటె కార్లే యెక్కువ వున్నట్లున్నాయి ఈ దేశంలో" అనుకుంది స్వగతంగా.

చటుక్కున తన ఊరు, తమ యిల్లు, బంధువులు అందరూ గుర్తొచ్చారు.

బస్‌స్టాండ్‌దాకావచ్చి యెప్పుడూ గడప కూడా దాటని చిత్ర అంతదూరం ఎలా వెళ్తుందోనని, ఎప్పుడూ విడిచి వుండని తాము మళ్ళీ చిత్ర నెప్పుడు చూస్తామో నని దిగులుపడుతూ తాతయ్య, నాయనమ్మల కన్నీళ్ళు! స్టేషన్‌లో రైలెక్కేటప్పుడు తనను దగ్గరికి తీసుకున్న అమ్మ కళ్ళల్లోంచి కారే కన్నీటి ధారలు! వచ్చే దుఃఖాన్ని అదుపులో పెట్టుకుంటూ జాగ్రత్తగా వెళ్ళిరమ్మని చెప్పిన అత్తయ్య కళ్ళలోని సన్నటి కన్నీటి తెర! "అక్కా నువ్వెళ్ళితే మేమెలా వుండా"లని అడుగుతున్న చెల్లెళ్ళ కళ్ళలోని తడి. వారపత్రికలు యిస్తూ "అక్కా దారిలో కాలక్షేపానికి" అంటూ అంతకన్నా ఎక్కువ మాట్లాడరాని దుఃఖాన్నాపుకుంటున్న తమ్ముడి కళ్ళల్లోని బాధ. "వదినా ఒక్కసారి నవ్వుతూ పోజివ్వవూ" అంటూ వాళ్ళ (ఇన్నాళ్ళూ కలిసి వున్న వదిన వెళ్ళిపోతోందన్న) బాధను కళ్ళల్లోనే దాచుకుని అందరి మనసులూ తేలికపరచ ప్రయత్నిస్తూ కెమెరాలు క్లిక్ మన్పిస్తున్న మరుదులు. "వారానికో ఉత్తరమన్నా వ్రాయకపోతే ఊరుకునేదిలేదు" అంటూ ఆజ్ఞాపిస్తున్న ఆడబిడ్డల కళ్ళల్లోని ప్రేమ. "మర్చిపోవు కదూ చిత్రా! వెళ్ళగానే నీ ప్రయాణం గురించి వ్రాస్తావుకదూ!" అంటున్న తోటికోడళ్ళకళ్ళల్లోని స్నేహం; "ప్రయాణంలో జాగ్రత్త. చందన్ నడిగానని చెప్పు" అంటూ వీడ్కోలు చెప్తున్న మామగారు; బొంబే ఏర్‌పోర్ట్‌లో ప్లేన్ ఎక్కే ముందు "ధైర్యంగా వెళ్ళమ్మా" అంటూ తల నిమురుతున్న నాన్నగారి చెమ్మగిల్లిన కళ్ళు; ప్రయాణంలో ఏపే జాగ్రత్తలు తీసుకోవాలో, ఎక్కడ ఎలా ప్రవర్తించాలో చెబుతూ ధైర్యం కల్గించిన బావగారు- అందరూ గుర్తొచ్చి చిత్ర మనసు చెప్పరాని బాధతో బరువెక్కింది. "ఆయనైనా వస్తే బాగుండు" అనుకుంది. వెంటనే గుర్తొచ్చింది-ఏవైనా అవసరమైతే తనకు ఫోన్ చెయ్యమని, ఎలా చెయ్యాలో వివరంగా వ్రాసిచ్చిన కాగితం. ఫోన్ దగ్గరికి వెళ్ళి కాగితంలో వ్రాసిన ప్రకారం "ం"కు డయల్ చేసింది. కాని ఒక పట్టాన ఆ తెలుగులో వ్రాసిన ఇంగ్లీష్ మాటలు పలకాలంటే నోరు రావడంలేదు. అవతల నుంచి "స్విచ్‌బోర్డ్" ఒకటే అరుస్తోంది "హలో హలో" అని. ఎట్లాగో గొంతు సవరించుకుని, నోరు పెగుల్చుకుని "కెను అయి స్పీకుటు డాక్టరు చందు" అంది. "స్విచ్‌బోర్డ్"కు చిత్ర మాటలు ఛస్తే అర్థం కాలేదు. "అయామ్ సారీ కెన్ యు రిపీట్ ఇట్" అంటూ ఓ అరడజను సార్లు "స్విచ్‌బోర్డ్" అరిచీ అరిచీ తల బద్దలు కొట్టుకున్నా చిత్ర కేమీ అర్థం కాలేదు.



# ఇంగ్లండులో ఓ తెలుగు చేమంతి

మాచర్ల ప్రేమ



విసుగ్గా ఫోన్ పెట్టేసి తనకు ఇంగ్లీష్ రాకందుకు కాసేపు తనను తనే తిట్టుకుంది. మరికాసేపు తనను చదివించకుండా ఆ పల్లెటూర్లో వుంచి రామాయణ, భాగవతాల సారం ఔపోసన పట్టించిన 'తాతయ్య'ను కాసేపు విసుక్కుంది.

ఆ తర్వాత నాలుగు గంటలకే చీకటైపోయిన ఇంగ్లండ్ వాతావరణానికి చిరాకు పడుతూ కాసేపు గడిపింది.

తర్వాత ముఖం కడుక్కుందామని బాత్‌రూమ్‌లో కెళ్ళిన చిత్రకు మూలకు వేలాడగట్టిన "హౌజ్ ప్లాంట్" కన్పించి తమ ఇంట్లో తను పెంచిన మల్లె చెట్టు గుర్తొచ్చి మనసు బాధగా మూలిగింది. ముఖం తుడుచుకుని బొట్టు పెట్టుకుందామని డ్రాయరు లాగిన చిత్రకు పౌడర్లు, క్రీములు రకరకాలవి ఘుమ్మన వాసన వస్తూ కన్పించాయి. కాని "కుంకుమ" ఎక్కడా కన్పించలేదు. అప్పుడు గుర్తొచ్చింది- చందన్ దగ్గర కుంకుమ ఎందుకుంటుందన్న విషయం.

తన సూట్‌కేస్‌లోంచి కుంకుమ భరిణ తీసుకుని "ముత్యమంతా పసుపు ముఖమంత చాయ" అంటూ సన్నగా కూని రాగం తీస్తూ బొట్టు దిద్దుకుంటున్న చిత్ర చందన్ అడుగుల సవ్వడికి తల తిప్పి చూసింది. అప్పుడు గుర్తొచ్చింది- ఇందాకట్నించీ తను వొంటరిగా పడ్డ మానసిక బాధ అంతా. ఒక్క పరుగున వెళ్ళి అత

సినీ తారలు

శ్రీదేవి, సుజాత, జయసుధ, జయప్రదల ఫొటోల సెట్టు 5రూ. ఏయన్నార్, ఎన్టీఆర్, శోభన్‌బాబు, కృష్ణ, కృష్ణంరాజుల ఫొటోల సెట్టు 6రూ. తెలుగు, హిందీ తారల అడ్రసులు (ఫోను నంబర్లతో సహా) గల పుస్తకం 2రూ. ఎం.ఓ. చేయండి!

SUVARNA

వై.కె.మూర్తి
దాసరివారివీధి, విజయవాడ-2



సేల్స్ టాక్స్ చట్టము
[తెలుగు]

ప్రతి వ్యాపారస్తుడు చదువ తగిన ప్రప్రథమ తెలుగు ప్రచురణ.

: ఇందులో :
ఆంధ్రప్రదేశ్ జనరల్ సేల్స్‌టాక్స్ చట్టము అన్ని సెక్షనులు, రూల్సు, వ్యాపారస్తులకు సులభముగా అర్థమగు శైలిలో ముఖ్యమైన కేసుల తీర్పు వివరణలు పొందుపరచి వ్రాయబడినవి.
వర్తకులు అనుసరించవలసిన వివిధ నియమములు, అన్ని సరుకుల సేల్స్‌టాక్స్ రేట్లు ప్రత్యేక అనుబంధములో వివరించబడినవి.

ప్రతులకు రూ. 24/-M.O చేయండి.

V.P.P పద్ధతి లేదు

రోహిణి పబ్లికేషన్స్
8-399A గోలివారివీధి, మంగళగిరి. 522 511



డా॥ పి. వి. కె. రావ్, B. A.,
వైద్యవిద్వాన్, వైద్యాచార్య, సెక్స్ స్పెషలిస్ట్



వివాహము వాయిదా వేయనవసరంలేదు. హస్త ప్రయోగం, నరముల బలహీనత, శీఘ్ర స్ఖలనములకు ఆయుర్వేద చికిత్స పోస్టు ద్వారా చికిత్స కలదు.

రావూస్ క్లినిక్,
టి. బి. రోడ్, తెనాలి. ఫోన్ : 700, 1010


డిని సోఫాలో కూలేసి తనూ పక్కనే కూర్చుని ఫుల్‌స్టాప్, కామాలు లేకుండా తను నిద్రలేచినప్పటినుంచి అప్పటి వరకు జరిగిందంతా పూసగుచ్చినట్లు చెప్పేసింది. అంతా ఓపికగా విన్న చందన్ చిత్రను ఓదారుస్తూ "నీకు రేపు శనివారం షాపింగ్ సెంటరంతా తిప్పి చూపిస్తాను. నీకు తోచనప్పుడల్లా అలా వెళ్ళి తిరిగి రావచ్చు. టి. వి. పెట్టుకుని చూడు కావల్సినంత కాలక్షేపం. నీకు ఇంగ్లీష్ రాదని ఏమీ బాధపడకు. రోజూ సాయంత్రం ఒకగంట నీకు నేను ఇంగ్లీష్ నేర్పుతాను" అన్నాడు.

ఆ మరునాడే అన్నట్లుగా షాపింగ్ సెంటరంతా తిప్పి చూపించాడు చందన్ చిత్రకు. ఎలా షాపింగ్‌చేయాలో వివరిస్తుంటే శ్రద్ధగా విన్నది చిత్ర.

ఒకరోజు మధ్యాహ్నం ఏమీ తోచకుండా వుంటే షాపుల్లో అయినా తిరుగుదామని బయల్దేరింది చిత్ర. ఒక టన్ను బరువున్న కోటు, చేతులకు గ్లౌస్, కాళ్ళకు సాక్స్, బూట్లు, తలకు స్కార్ఫ్ చుట్టుకుని నడవాలంటే గొప్ప చిరాగ్గా ఉంది. అతి చల్లటి చలిగాలి ముఖానికి తగిలి ముక్కూ, చెంపలూమండుతూ, బూట్లతో నడవలేక చీర తట్టుకుంటూ వుంటే "ఇదేం దేశం బాబూ అసలు బయటకి రాకుండా వుండాల్సింది" అనుకుంది. షాపులో బిల్ చెల్లిస్తూన్నప్పుడు మాత్రం "అబ్బ ఇక్కడ మాట్లాడాల్సిన పనిలేదు" అనుకుంటూ తేలిగ్గా ఊపిరి పీల్చుకుంది.

ఒక రోజు "టి. వి. చూస్తే నన్నా కాస్త ఇంగ్లీష్ అర్థమవుతుంది" అన్న చందన్ మాటలు గుర్తొచ్చి టి. వి. ఆన్ చేసింది చిత్ర.

ఒక గంటసేపు చెవులప్పగించి శ్రద్ధగా విన్నా ఏదో "కిసాపిసా, కుయ్ కయ్" అన్నట్లు, డబ్బాలో గులకరాళ్ళు పోసినట్లు తప్ప ఒక్కమాటలోని ఒక్క అక్షరం కూడా అర్థం కాలేదు. "ఛఛ ఇదేం భాష పిట్టలు కీచుకీచుమన్నట్లు, కుక్కపిల్లలు కుయ్ కుయ్ మన్నట్లు. అయినా ఆ మనుషులూ – వేషాలూ – అబ్బ చూడలేక పోతున్నాను. ఆ ఆడవాళ్ళ బట్టలు మరీ ఘోరంగా వున్నాయి. బొట్టు, కాటుక, గాజులు లేకుండా తలలు విరబోసుకుని, చేతుల్లేని గౌన్లు వేసుకుని ఇదేం ఆడవాళ్లు? ఆడపిల్ల అంటే బొట్టు, కాటుక, పూలు, గాజులు చీరకట్టుతో పూలకొమ్మలా వుండాలి. కాని ఆకుల్లేని చెట్టులాగా ఇవేం వేషాలు" విసుక్కుంటూ టి. వి. ఆఫ్ చేసింది చిత్ర.

రోజూ ఇంగ్లీష్ నేర్చుకునే ఆ గంటసేపూ ప్రాణం మీదికొచ్చినట్లుగా ఉంటూంది చిత్రకు. చందన్ చెప్పేవేవీ సరిగా బుర్రకెక్కడంలేదు. చందన్ ముందు ఆ పదాలు పలకాలంటే చచ్చేంత సిగ్గుగా ఉంటోంది. తెలుగులో ఇంగ్లీష్ పదాలు వ్రాసి ప్రక్కనే వాటి అర్థాలు వ్రాసి మధ్యాహ్నమంతా వాటిని బట్టీపట్టి సాయంత్రం తనకు ఒప్పచెప్పమనేవాడు చందన్.

కాని "దటీజు ఎ బుక్కూ"; "దిసీజు ఎ చేరూ", "వాటీజు యువరు నేమూ" అంటూ దీర్ఘాలు తీస్తూ ఒప్పచెప్తుతున్న చిత్రను చూస్తే మతిపోయేదతడికి. తను వ్రాసిచ్చింది చదవకుండా ఇండియానుంచి తెచ్చుకున్న తెలుగు పుస్తకాలు చదువుతున్న చిత్రను చూస్తే విసుగొచ్చే దతనికి. "ఇలా అయితే, ఇంగ్లీషెలా వస్తుంద"ని విసుక్కుంటే చిత్రకు అమ్మ, నాన్న అందరూ గుర్తొచ్చి జలజలా కన్నీళ్ళు కార్చి ముసుగుపెట్టి అలనాటి సత్యభామను గుర్తుకు తెచ్చేది. "ఇంగ్లీష్ భాష" వాళ్ళిద్దరి మధ్యా ఎన్నిసార్లు కన్నీళ్ళు, కలతలకు కారణమయిందో లెక్కలేదు. ఆఖరికొకరోజు తెగించి చెప్పింది చిత్ర "నాకా ఇంగ్లీషూ వద్దు, పాడూ వద్దు" అని. కాని చందన్‌మాత్రం తప్పకుండా ఇంగ్లీష్ నేర్చుకు తీరాలని పట్టుపట్టాడు.

చందన్ అదృష్టమో, చిత్ర దురదృష్టమో కాని చందన్ పనిచేసే హాస్పిటల్‌కు మరో తెలుగు డాక్టర్ 'డా॥ రావ్' వచ్చాడు. అతని కుటుంబంతో పరిచయం చేసుకున్న చందన్ ఆనందానికి అవధుల్లేవు– ఎందుకంటే "సారా" అని పిలవబడే రావుగారి భార్య "సరస్వతి" ఎం. ఎ. చదివిందని. ఆ మరునాడే వారిని తమ ఇంటికి "టీ"కి రమ్మని ఆహ్వానించాడు చందన్.

మొదటిసారిగా పరిచయం చేసుకున్న "సారా"ను చూసిఆశ్చర్యపోయింది చిత్ర. మరికాసేపటికి ఆమె పేరు "సారా" అని తెల్సుకుని. అసలే ఆమె ధరించినప్యాంట్, షర్ట్ వేషధారణ చూసి ఆశ్చర్యంతో తల మునకలవుతూ "ఆంధ్రుల ఆడపడుచులు ఇలాగకూడా ఉంటారా?" అనుకుంటున్న చిత్ర 'సారా' పేరు వినగానే "ఇదేం పేరు? సారా కొట్టులా" అనుకుంటూ కళ్ళు పెద్దవిచేసి చూడసాగింది.

చిత్ర తప్ప అందరూ ఇంగ్లీషులోనే సంభాషణ సాగించారు చాలాసేపు. తెలుగు వాళ్ళంటె "హాయిగా తెలుగులో మాట్లాడొచ్చుకదా" అని సంబరపడ్డ చిత్రకు

తన ఉనికినే గమనించకుండా వాళ్ళు ముగ్గురూ అలా మాట్లాడుకుంటుంటే కళ్ళ నీళ్ళ పర్యంతమయింది.

భార్య అవస్థ గమనిస్తున్న చందన్ మాత్రం కాసేపటికి ప్రయత్నపూర్వకంగా సంభాషణ "తెలుగు"లోకి మార్చేశాడు. అప్పటికిగాని శాస్త్రిగారి పిల్చుకుని మనసులోనే భర్తకు "ధన్యవాదాలు" చెప్పుకుంది చిత్ర.

మాటలమధ్యలో "మీ వైఫ్‌కు ఇంగ్లీష్ రానట్లుందే" అని చందన్ నడిగింది"సారా' స్టైయిలిష్‌గా బిస్కెట్ కొరుకుతూ. "అవునండీ-వాళ్ళది చాలా చిన్న పల్లెటూరు. కనీసం స్కూల్ కూడా లేదా ఊళ్ళో—మీకు వీలైతేమధ్యాహ్నం ఓగంటఇంగ్లీష్ నేర్పగలిగితే మీకు చాలా ఋణపడి ఉంటాం." తన మనసులో ఎప్పటినుంచో రిహార్సలు చేసుకుంటూ ఎప్పుడవకాశం వస్తుందా? ఎప్పుడడుగుదామా? అని ఎదురు చూస్తున్న చందన్ త్వరగా పాఠం ఒప్ప చెప్పినట్లుగా చెప్పాడు. "ఆ ఇంగ్లీషురాని పిల్లను చేసుకుని పొరపాటు చేశావ"న్నట్లు ఓచూపు విసిరి "అలాగే చెప్తాను. తను నేర్చుకోవాలేగాని రెండు గంటలైనా చెప్తాను" అంటూ మళ్ళీ తన "ఇంగ్లీష్ భాషా ప్రావీణ్యం" చూడమన్నట్లు ఇంగ్లీష్‌లో సంభాషణకు దిగింది "సారా."

ఇదంతా మౌనంగా వింటూన్న చిత్ర మనసు హడలెత్తిపోయింది. "మహాతల్లీ! ఇప్పటికే ఆయన గంటసేపు నా ప్రాణాలు తీస్తున్నారు. ఇక నువ్వూ దాపురించావా! భగవంతుడా, ఈ ఆపదనుంచి నన్నెలా కాపాడుతావో" అని మనసులోనే ఏడుకొండలవాడికి భక్తిగా దణ్ణం పెట్టుకుంది చిత్ర.

దాదాపు ఆరు నెలలనుంచి చందన్, సారా ఇద్దరూ నూరిపోస్తున్నా చిన్న చిన్న మాటలకు అర్థాలు తెలిశాయి తప్పితే మాట్లాడటం మాత్రం రాలేదు చిత్రకు. పగలంతా పారాయణం చేసినా "దిసీజు చేరూ: వాటీజు యువరు నేమూ" అనడం తప్ప ఏమాత్రం ప్రోగ్రెస్‌లేకపోయింది.

ఒక రోజు మూడు గంటలవేళ చందన్ ఆదరా బాదరా ఇంటికొచ్చి "రేపు మా కన్సల్టెంట్ డిన్నర్‌కు పిలిచాడు.వెళ్ళాలి. ఎవ్వరేదయినా అడిగితే "అయామ్ సారీ. ఐ డోంట్ నో మచ్- ఇంగ్లీషు"అని చెప్పు అంటూ కాగితంపై వ్రాసి అది బట్టీపట్టమని చెప్పి వెళ్ళిపోయాడు. విధిలేక దాన్ని పారాయణం చేయడానికి నీరసంగా సోఫాలో కూలబడింది చిత్ర.


## రూపానికి రూపం-గుణానికి గుణం!




**ఫిలిప్స్ వేలియంట్** 4 బ్యాండ్లు

- పుల్ ఫాయిల్ క్రోంబెర్ గ్రిల్
- స్లైడ్ కంట్రోల్స్
- క్రోమ్ పుష్ బటన్లు
- సులభంగా కరంటుకు మార్చుకోవచ్చు

రూ. 615

ఆడియోవిజన్, ప్రకాశం రోడ్, విజయవాడ–2. ఫోన్: 76369. Ganesh



# Sri Rama B.Ed / M.Ed Coaching Institute
**NELLORE**

(Branch : KURNOOL)

Principal : B. Ramasubbaiah
(Retired Lecturer, Govt. College of Education)

1. 3rd Batch of B.Ed from this institute and 2nd batch for M.Ed.
2. All graduates are eligible as in last year for B.Ed All B.Eds are eligible for M. Ed.
3. Contact programmes and Exams at Nellore.
4. Personal and postal coaching.

Contact **V. V. Sarma** M. A., M.Ed,
B/B 353 B. Camp, **Kurnool**

If You wish to join at Kurnool. Apply for prospectus paying Rs. 2/–



## మెయిల్ అందుకునేందుకు త్వరగా పోస్టు చేయండి



పన్నులతో సహా రు. 125/—లకే 2 బాండ్ ఆల్ వరల్డు మ్యూజికాన్ ట్రాన్సిస్టర్ పొందండి.

వి. పి. పి. ద్వారా ప్రతి గ్రామము, పట్టణమునకు పంపబడును.

వ్రాయండి :

MUSIC MAHAL, Post Box No-9405, Delhi-110 051.

ఆ మరునాడు సాయంత్రం డిన్నర్‌కు వెళ్ళడానికి ముస్తాబవుతున్న చిత్రను ఎగాదిగా చూస్తూ "ఆ బొట్టు అంత పెద్దగా ఏం బాగులేదు. ఆ జడంతా విప్పేసి పైన రబ్బర్ బ్యాండ్ పెట్టుకో, మరీ వేషం వేసినట్లు చెవులకా జూకాలూ, చేతులకు అన్ని గాజులూ ఎందుకూ? అంత పెద్ద జరీ అంచు చీర బాగాలేదు. నల్లచుక్కల గులాబీ చీర కట్టుకో" అంటూ పాపం చిత్ర ఎంతో సరదాపడుతూ ఎంచుకున్న అలంకరణ అంతా తీసేయించాడు చందన్.

చందన్ కన్సల్టెంట్ డాక్టర్ విల్సన్, అతడి భార్య సిల్వియా ఇద్దరూ చందన్, చిత్రలను లోనికి ఆహ్వానిస్తూ 'షేక్ హాండ్' యిచ్చారు. సిల్వియాకు మాత్రం షేక్‌హాండ్ యిచ్చింది చిత్ర. కాని. విల్సన్‌కు ఇవ్వలేకపోయింది. 'షేక్ హాండ్ ఇవ్వమని' ఇంట్లో చందన్ చెప్పిన మాటలు గుర్తున్నాయి. కాని ఎంత ప్రయత్నించినా చేయి ముందుకు సాగలేదు. అప్రయత్నంగా రెండు చేతులూ జోడించి "నమస్కారం" అంది చిత్ర. విల్సన్ తెల్లబోయి చూస్తూ "మళ్ళీ అలాగే అనాలి కాబోలు" నను కుంటూ అవస్థపడుతూ, మెలికలు తిరిగిపోతూ చిట్ట చివరికి అతి ప్రయత్నంమీద రెండుచేతులూ జోడించి, నోరు నూరు వంకర్లు తిప్పుతూ "న్యామస్క్యార్యం" అనగలిగాడు- అంత ఆరడుగుల పొడుగూ, అంతే చుట్టుకొలతా కల్గిన లావూ ఉన్న మనిషీ ఏదో వింత నాట్యం చేస్తున్నట్లు నమస్కారం చేయటంచూసి ఫక్కున రాబోయే నవ్వును బలవంతంగా ఆపుకుంది చిత్ర.

ఆ తర్వాత సిల్వియా ఏదేదో మాట్లాడుతుంటే ఏవో ఒకటి రెండు మాటలు తప్ప ఆ అర్థం కాని భాష వినీ వినీ విసుగొచ్చింది చిత్రకు. చివరికి విల్సన్ ఏదో అడిగితే చిత్ర కర్థం కాలేదు. "నిన్న ప్రాసిచ్చింది చెప్పమని" కళ్ళతోనే సైగ చేశాడు చందన్. అది చెప్పాలనే అరగంట నుంచీ అవస్థ పడుతూంది. చిత్ర ఎంత ప్రయత్నించినా బట్టీపట్టిన వాక్యంలోని మొదటిపదం ఎంతకూ గుర్తురావడం లేదు. చివరికి ఎవరూ చూడకుండా చందన్ చెవిలో అడిగింది చిత్ర "మొదటిది" ఏమిటని? ఆ "మొదటిది" దేనికి మొదటిదో అర్థంకాక గుడ్లు మిటకరించి చూశాడు చందన్.



మాస్కోకు వెళ్ళగలిగే
ఆస్కారం లేకపోయినప్పటికైనన్
విస్కీ సేవిస్తూనే
శ్రీస్కైనై బతకగలను సిరిసిరిమువ్వా

---

వెళ్ళిపోయేముందు అతి ప్రయత్నం పైన గుర్తొచ్చింది చిత్రకు. "అయ్యాం సారి అయిడోంటునో మచ్చ ఇంగ్లీషు" అంది టీచర్ ముందు పద్యం ఒప్పచెప్పే విద్యార్థిలా. వచ్చినప్పటినుంచీ ఉలుకూ పలుకూ లేకుండా పాలరాతి బొమ్మలా కూర్చున్న చిత్ర చివరికి చెప్పిన ఆ మాటలు వాళ్ళకసలే అర్థం కాలేదు. తెల్లబోయి చూస్తున్న విల్సన్ దంపతులకు చిత్ర చెప్పిందేమిటో వివరించాడు చందన్.

కార్లో కూర్చోగానే విపరీతంగా పకీ పకీ నవ్వసాగింది చిత్ర. ఆ నవ్వు చూస్తే అసలే కోపంగా వున్న చందన్ మరింత మండిపడ్డాడు. "చేసిందిచాలక పైగా నవ్వుతున్నావా?" అన్నాడు చందన్ కోపాన్ని అదుపులో పెట్టుకుంటూ.

"ఏం చేశాను?" తనేం తప్పు చేసిందో అర్థంగాక అమాయకంగా అడిగింది చిత్ర నవ్వు నాపేసి.

"ఇంకేం చెయ్యాలి? కాస్త మనసు పెట్టి ఇంగ్లీష్ నేర్చుకుంటే తప్పా?" విసుగ్గా అన్నాడు చందన్. "మీకో నమస్కారం, మీ ఇంగ్లీష్‌కో నమస్కారం నాకీ జన్మలో ఇంగ్లీష రాదు దయచేసి యిప్పటికైనా నాకా ఇంగ్లీషుభాషా విముక్తి కల్గించండి. అసలు నన్నీ దేశాని కెందుకు తీసుకొచ్చారు?" అంది ఉబికి రాబోతున్న దుఃఖాన్నాపుకుంటూ. మళ్ళీ యెక్కడ సత్యభామావతారం ఎత్తుతుందోనని భయంవేసింది చందన్‌కు.

"అది సరేగాని 'షేక్ హాండ్' ఇవ్వమని నోరు నొప్పి పెట్టేలా పదిసార్లు చెప్పానుకదా! మరి ఎందుకివ్వలేదు?" కాస్త నెమ్మదిగా అడిగాడు చందన్. 'షేక్‌హాండ్' మాట వినగానే మళ్ళీ పకీ పకీ నవ్వసాగింది చిత్ర. అప్పుడర్థమయింది చందన్‌కు ఇందాక చిత్ర ఎందుకు నవ్విందో. అంత కోపంలోనూ 'విల్సన్ భారీ విగ్రహపు వింత నాట్యం' గుర్తొచ్చి తనూ నవ్వకుండా ఉండలేకపోయాడు.

ఆ రాత్రి చందన్ కెంతకూ నిద్ర రావడంలేదు. తను చిత్రను పెళ్ళిచేసుకుని పొరపాటు చేశాడా? తన పెళ్ళిముందు ఫ్రెండ్స్ అందరూ అడిగారు "ఇంగ్లీష్ రాని పిల్లను ఇంగ్లండ్ వెళ్తూ ఎలా చేసుకుంటున్నా"వని? వారికి చిరునవ్వే సమాధానంగా ఇచ్చాడు. ముద్దమందారంలా ముద్దు ముద్దుగా ఉంది. ఇంగ్లీషేముంది తను నేర్పొచ్చనుకున్నాడు. పెళ్ళయిన వారం రోజులకే తనిక్కడికొచ్చాడు. తర్వాత ఆరునెలలకే వచ్చేసింది చిత్ర. కాని ఆరునెల్లనుండీ ఓపికగా నేర్పినా రావడం లేదింగ్లీష్. ఇంగ్లీష్ నేర్చుకునే టప్పటి చిత్ర ముఖం గుర్తొచ్చి అంతవరకూ ఉన్న కోపమంతా మాయమయి జాలి, ప్రేమ చోటు చేసుకున్నాయా స్థానంలో. అమాయకంగా నిద్రిస్తున్న చిత్ర ముఖం "అరవిచ్చిన అరవిందంలా" అందంగా వుంది. ఏం కలగంటూందో కాని ఆమె పెదవులపై చిరునవ్వొకటి మెరిసి మాయమయింది.

"ఏ దేశమేగినా. ఎందు కాలిడినా నా తెలుగు మాటనే పలికేను నేను" అని ఆ నవ్వుకర్థం చెప్పుకున్నాడు చందన్.